శ్రీ వేగుంట మోహనప్రసాద్

# బతికిన క్షణాలు

## ముందు మాట

ఈ పద మూర్ఛనలు వచ్చిన తర్వాత చెప్పే మొదటి మాటలు. కలల అలికిడికి లేచిన మంచినీళ్ల గ్లాసు అలల గల గల. భౌతిక జీవితంలోంచి దూసుకొచ్చిన ఎప్పుడో గుచ్చుకున్న గవర్మెంట్ తుమ్మముళ్లు. ఆలోచననీ అనుభూతినీ కలగలిపి రైలెళ్లి పోయిన తర్వాత మిగిలిన పట్టాలమీద కూచుని చూస్తున్న అనుభవపు చారికలు.

వాస్తవాన్ని అధివాస్తవికంగా మలచుకొనే ప్రయత్నంలో వచనం విరిగి ముక్కలయి ఆ గాజు పెంకులు పద్యానికి గుచ్చుకొంటాయి.

గ్రూప్ ఫొటోలో ఒక్కొక్కళ్ల రెండు కళ్లనీ సుతారంగ కత్తిరించి చివరికి మిగిలే జల్లెడ చిత్రంలోంచి వచనపు తుంపుర్ని విచారహస్తాల్లో పట్టుకుని జల్లిస్తున్నాను.

ప్రతి నేనుకీ ఒక మేనుంటుంది. నేను లోంచి మేము, మనం అవటానికే ఏ రచన అయినా. తారీఖులూ దస్తావేజులూ ఏమీలేని అనామక స్వీయ జీవన చిత్రణ ఈ 'బతికిన క్షణాలు.' దృశ్యం అదృశ్యంగానూ శబ్దం నిశ్శబ్దంగానూ రంగులు పులుముకుని మాటలుగా మ్రోగుతయ్.

అంతాలో ఎంతో కొంత యిది.

ఎక్కువ మాట్లాడేవాడు ఏమీ చెప్పడు.

నిశ్శబ్ద క్షణంలో శాశ్వత శతాబ్దాన్ని పట్టుకోవాలని ఈ నూత్నయత్నం.

– రచయిత

నా మొదటి గుర్తు కర్వేపాకు, దాని కాయ వాసన, కొమ్మ విరక్కుండా రెమ్మ దూయటం, కాయ చిదపటం, చేతికందిన కాయ చెమ్మని పీల్చటం, ఇసికలో కాళ్లవేళ్లు దున్నుతూ చారికలుగా నడవటం, నాపాదాల స్పర్శని ఇసిక నాఘ్రాణింప చేయటం, చెరుకుపల్లిలో.

నా మొదటి స్పర్శ లాగుతూన్న బండిని మోస్తూన్న ఎద్దుని కొట్టినపుడు నా వీపుమీద పడిన బండివాడి చర్నాకోలు. నా మొదటి శబ్దం వాడు తిట్టిన తిట్టు. కొవ్వలిలో.

నా మొదటి ఆశ కలరా ఉండని తిందామని. మిలమిలా మెరిసిపోతూ ఎందుకో తెలీని కాంతి పంపించిన సంకేత కిరణం అమ్మమ్మ వాళ్ల ఊళ్లో కిరాణా కొట్లో.

ఎవరేనా నాకిచ్చిన శాంతాక్లాజ్ మా పెద మామయ్య. సంస్కృతం హిందీ చదువుకొన్న పెదమామయ్య దగ్గరకు పిలిచి కొనిచ్చిన ఎర్ర ఐస్క్రీమ్ బిళ్ల చనుబాలులా చీకిన స్తనం.

దేవుడు నాకు తొలీగా కన్పించింది వాడి గూట్లో అణాబేడాలు చూపించినప్పుడు తీసుకోమని మొహమాట పెట్టినపుడు, అదీ అమ్మమ్మ పడక్కుర్చీ వెనకాల నుంచుని ఎక్కాల బొక్కు చూస్తూ ఎక్కాలప్ప చెప్పినపుడు.

అంతా చీకటిగా ఉన్నపుడు తోచిన ప్రథమ కిరణం అమ్మమ్మ చచ్చిపోయినపుడు వెలిగించిన ఆముదపు ప్రమిద. నేనెందు కేడవలేదో నని నా కెంతో సంతోషంగా ఉందిపుడు. విషాదమల్లా ఏడవటానికి కారణాలు తెలిసినపుడే.

కక్ష తాతయ్యమీద. రైలుకీ రైలాగే అరుక్కీ మధ్యన ఇరుక్కుపోయిన కాలుతో నడిచిన తాతయ్యను ఎలా అయినా చంపేద్దామని పడుక్కున్నపుడు పక్కమీద పల్లేరుగాయలు చల్లుదామని ప్లాను. అనుకున్నదీ అనుకోనిదీ మధ్యఉన్న జగత్తుకి అర్థం ఎలియట్ని చదివేదాక గాని తెలీలా.

నేరానికీ పాపానికీ తేడా తెలీని బాల్యంలో చేసిన పది రూపాయిల దొంగతనం చచ్చేదాకా గర్వకారణం. అదిపెట్టి తిన్న హోటలు అట్లూ, కొనుక్కున్న సిరా కన్పించే కలవూ, తాగిన సిగిరెట్లూ ఇంటి కొచ్చి తిన్న తిట్లూ, కొట్లూ ఈ జన్మాంతానికి చేయబోయే పాపాల్ని అన్నిటినీ కాచుకొనే శిక్ష.

రాయపూడి జాము తోటల్లో దొంగతనంగా కోసుకొచ్చి లాగూ జేబుల్లో ఒళ్లో చేతుల్లో దాచుకొచ్చి తుళ్ళూర్లో మాలపల్లిలో అమ్మిన డబ్బుల్తో కొనుక్కున్న బీడీల పొగ ఆఖరు క్షణాల దాకా సరి పోతుంది పీల్చడానికి.

అరటికాయ వేపుడని తినిపించిన మాంసపు ముక్కలు ఇక తినలేనుగాక తినలేను. వాడిపుడు ఏంజేస్తున్నాడో స్కూల్లో నాకంటే జూలాయి వెధవ.

*　　　*　　　*

ఆకాశవాణి ప్రసారారంభంలో వయొలిన్ కాసేపేడుస్తుంది. ఎక్కడా సఫలం కాని ప్రేమ ఎదురుబడినాక గాని షహనాయ్ అంత కంటే బాగా ఏడుస్తుందని అర్థం కాలా. కార్టర్ విల్ నుంచి చికాగోకి అన్నాయి కారు తోలుతున్నప్పుడు ఇంకా బాగా ఏడ్చాను వేంకటేశ్వర సుప్రభాతం విని. పారా పలుగుల తీక్ష్ణానికి కారాగినపుడు భానుమతి ఏడ్చింది మల్లీశ్వరిలా.

నా పుస్తకాల గూట్లో అంటోన్నాడు వజ్రీరహ్మాన్ 'ఎచటికి పోతావీ రాత్రి?'

"పరమ దారుణ కసికంత్రీ!
ఎచటికి పోతావీ రాత్రి
రేగిన
చెలరేగిన
గాలి హోరులో
శోక ఆకసాన. ."

చిన్నప్పుడు చించేసిన, కావలని ఆ అమ్మాయినుండే, చూపించకనే చించేసిన ప్రేమలేఖల ముక్కలే ఇవ్వాళీ పక్షులయి మళ్లీ ప్రతి రాత్రీ నా గూటికి చేరుకొంటాయి.

ఎస్సెల్సీలో ఉన్నప్పుడు నాతో చదూకునే దాశరథి అందమైన గొంతుతో 'ఎంకి పాటలు' పాడి అమ్మాయిల్ని గుంపేసుకున్నప్పుడు ఆ నల్లని వాడిమీద ఎంత అసూయో ఈనాడు నామీద నా కంత జాలి – పాటలు పాడే వాడిని ప్రజలు ఆర్టీసీ కండక్టరు చేసినందుకు.

వేపాకులు రాలిపడ్తున్నప్పుడు మంగలి నిర్దయగా కూచోబెట్టి మిషన్ కత్తెరేస్తున్నప్పుడు రాల్తున్న వేపాకుల్ని ఒక్కొకటే పట్టుకోవాలని తహ తహ. ఇవ్వాళ క్షౌరం చేయించుకోటానికి జుట్టెక్కడిది అంతా ఎండిన వేప చెట్టులా తల.

బురదలో బొటనవేళ్ళు గుచ్చి మరీ నడవాలి ఆ బురద నల్లరేగడి స్కూలు రోజుల్లో పడిపోకుండా నడవాలంటే జాగర్తగా. ఇరవై రెండు సంవత్సరాల తర్వాత అదే స్కూలుకి వెళ్లి హెడ్మాస్టరు లేని ఆదివారాన అంతా కంకర పరచిన ఆవరణలో బోగన్ విల్లాలు నవ్వుతూన్నప్పుడు నోటీసు బోర్డుమీద ఒక పాత విద్యార్థి అని రాసి వొచ్చానొక గొప్ప విజిటర్ ననుకొని. కాలంమీద ప్రతివాడూ సంతకం చేస్తాడు కొన ఊపిరి పొట్టే సంతకంలో.

ప్రథమంగా ఆత్మకు విన్పించింది వయొలిన్. ఆపైన జోగ్, బిస్మిల్లాలు కలసి విషాదించారు నా 1965లో ఒక రాత్రిపూట దుఃఖం ఉంగలుగా చుట్టుకొన్నప్పుడు ఆ ఏడుపుకి 'వయొనాయ్'అని పేరు పెట్టుకొన్నప్పుడు, ఆత్మవిచారం ఎర్ర లంగా కట్టుకొని నిశి దారాల సాంబ్రాణి పొగలో రింగులు తిరిగినపుడు.

*　　　*　　　*

సుడిగుండం అలల వడిని ముడివేస్తుంది. మళ్లీ అదే విప్పుతుంది ముడి. లాంచీమీద ప్రయాణం – బాహువులు చాచి ఆకాశం, ఒళ్లంతా పార్శించి కృష్ణానదీ. డబ డబ డబమని ఓమూడు గంటలు శబ్దించి శరీరం ఆ లయకు నినదించి ఎలా అయితేనేం దిగుతాంలాంచీ మళ్లీ నీటిని ముట్టకుండా – ఊగే విరుగుతుందేమోనని భయమేసే చెక్కముక్కమీంచి. అక్కణ్ణించి జట్కావాళ్లతో గొడవ. ఇంకా ఎక్కించుకోడేం? నీరు దాటినా నిప్పు దూకినా చక్రమెక్కినా ఎందుకీ డబ్బు?

డబ్బులూ, మార్కులూ, అన్నాయి తొడిగిన బట్టలు వచ్చే ఏడాది నేను వేసుకోవటాలూ, ఎవర్ని ఎదిరించుదామన్నా ఎత్తినచేయి విరుగుతుందేమోననే భయం, అసలెందుకు రోజా బడికెళ్లటం ఇలాగే లాంచీ నించి జట్కా నించి రైలెక్కి వట్లూరెళ్లి సెలవులంతా సంవత్సరాలై పోతే పోలా? ఏదీ ఎందుకు పోదు? ఏదీ ఎందుకు పోనీ నిలవదు?

1854 మార్చి 30న అమ్మ శవాన్ని తీసుకుని బ్రిడ్జి అపుడే కట్తున్న ఎండిన కృష్ణానది బస్సుల దారిన లారీలో వేసుకుని కరణం మునసబుల సర్టిఫికెట్‌తో వెళ్తున్నపుడు అపుడూ ఇపుడూ లారీల మీద వేసికెళ్లే సర్కసు పశువులు గుర్తు. చీకట్లోంచి చీకట్లోకి వెళ్తూ దారంతా ఏదో వస్తువు కోసం వెదుక్కుంటూ ఇంకా ముందుందేమోనని ఇంకా వడివడిగా వెళ్తూ అసలు వస్తువు లారీలోనే ఉందని తెలిదప్పుడు.

యూజీన్ అయొనెస్కో నాటకం "యామెడీ ఆర్ హౌటు గెట్ రిడ్ ఆఫ్ ఇట్" చదివినాక తెలిసొచ్చింది. చచ్చిపోయిన వాళ్లని పూడ్చి పెట్టటానికో దహనం చేయటానికో ఎంత తొందరపడ్తామో కాళ్లూ కాళ్లూ తొక్కుకుంటామో, ఎలాగోలా ఒదిలించుకోవాలి, ఎంత తొందరగా అయితే అంత మంచిది. ఈలోపల రావాల్సిన వాళ్లందరూ ఎంత తొందరగా వొస్తే అంతమంచిది. దేహం నిలవ ఉండదు. స్నానాలు చెయ్యాలి. ఇంక ఏడుపు ఆపుకోవాలి. అందరూ ఎంగిలిపడాలి.

నిద్ర భయం, మెలకువ భయం, నిద్రపొలిమేరల్లో పొలికేకలు, జాగరణ ఆవరణలో కునికిపాట్లు, మేనమామ కొత్త చొక్కాలు కుట్టించడం ఆచారం ఎందుకోగాని మంచిదే. ఒకరి మృత్యువు మరొకరి మరణాన్ని కాపాడుతుంది.

సుడిగుండం గిర గిరా తిప్పుతుంది దేహాన్నే గాదు మనసుని కూడ. అంతచ్చేతనంలో అన్నీ దాక్కుంటాయి మళ్ళీ తేల్తాయి ఎట్లాగో ఉలిపిరికాయితాల్లా.

*     *     *

అసంబద్ధత కూడ సంభవిస్తుంది. అబద్ధం కూడ సబద్ధమవుతుంది. అనిజం అసత్యం కాకనే నిజమవుతుంది. తెల్లారితే ఎస్సెల్సీ లెక్కల పరీక్ష. గడ్డిమీద పరుపు వేసుకొని ఎడ్లబండిమీద అనురావతి వెళ్ళి అక్కడ రాయాల్సిన పరీక్షలు అలా వెళ్లటం వల్ల ఉత్సాహం. ఎవరెవరు ఎలా వస్తున్నారో తెలుసుకొని స్నేహాలు కలగలుపుకొని నేనొక్కడ్నే ఆ బండిలో మా క్లాస్‌మేట్ అమ్మాయితో పరుపుమీద కూచుని వెళ్తున్నానని తెలుసుకొని గర్వంగా వెళ్లి రాసిన పరీక్షలు.

తెల్లారితే లెక్కల పరీక్ష. ఆ ఊళ్లో అప్పటికి రెండు సినిమా డేరాలున్నాయ్. ఒకటి శివభక్తితో కన్ను పొడుచుకుంటుంది. సాలీడున్నది. మొదటాటలో కన్ను పీక్కున్న ఆశ్చర్యం కాలమూ దూరమూ వేగమూతో సరిపోలదు. రెండో డేరాలో మా వెంట పరీక్షలు రాయించటానికొచ్చిన డ్రిల్లు మాష్టారి కన్ను గప్పటం. జీవిత కాలమంతా రాని లెక్కలు ఒక రాత్రి రెండో ఆటకి వెళ్లలేక పోవటంవల్ల వస్తాయా? ఒక్క గ్రాఫ్ లెక్కల్లో మాత్రం ఆశ నిరాశల నిమ్నోన్నతాలు కన్పించేవి. అందులోనూ ఆ సన్న సన్న గళ్ళ కాలాన్ని కొలిచే క్షణాలు బిందువు నుంచి బిందువు దాకా ఆకర్షించేవి.

మొదటి ఆటకీ రెండో ఆటకీ మధ్యలో ఉన్న సమయం కూడ సగర్వం. ఆ కాస్త గంటలో సమస్తకాలమూ స్తంభించి ఆ క్లాస్‌మేట్‌ని పలకరించగలగటంలో పులకరింత 'ఫ్రీజ్'అయి బాల్యం అంతా 'జామ్' అయింది.

తెల్లారేలేచి తుండుగుడ్డలు తీసుకొని మరొక సహవిద్యార్థితో కృష్ణలో స్నానం. పొద్దు తెలీని చెయ్యి, హద్దుల్లేని కాళ్లు కృష్ణలోంచి బయటికొచ్చేప్పటికి డ్రిల్లు మాష్టారి కంటపడి పరీక్షకి ఇంకొక అరగంట మాత్రమే ఉందనగా ముందు నేను, వెనుక మా కృష్ణా స్నాన సఖుడూ సైకిలుమీద పరుగో పరుగు.

చూచి నేర్చుకోవాల్సినవ్ ఎన్నో ఉంటై విషయాలు ముఖ్యంగా లెక్కల పరీక్ష హాల్లో. బాల్య స్నేహాలు ప్రతిఫలాన్ని కోరని సహాయాలు చేస్తూంటై. ఒకడి రహస్యాలు ఒకడికి చెప్పుకున్న ఉత్సాహం, అందునా కల్పిత రహస్యాల్ని విప్పారిన కళ్లతో ఒలక బోసుకున్న క్షణాలు వృధాపోవు. లాగు జేబుల్లోనూ చొక్కా చేతుల్లోనూ ఉండవు పక్కచూపులు, స్నేహ సహాయాలు.

అస్తిత్వంలోని శూన్యత్వాన్ని ఆమోదించటమంటే మేరీ వార్నాక్ మాటలు గుర్తుకొస్తున్నాయ్. "కాన్షస్ బీయింగ్స్ హేవ్ నో ఎసెన్సెస్. ఇన్‌స్టెడ్ ఆఫ్ ఎన్ ఎసెన్షియల్ కోర్ దే హేవ్ నతింగ్."

ఎవరూ ఎవర్నీ కళ్లల్లోకి చూడలేరు. పక్కచూపులేచూస్తారు. ఒక్కోసారి చూపుకందరు. దృశ్యా లదృశ్యమౌతాయి. రూపాలు రూపాంతరం చెందుతాయా అరూపాలవుతాయా విరూపాలౌతాయా నైరూప్యాలవుతాయానూ.

*     *     *

దేహం ఉన్నది. ఉంటూనే ఉన్నది. 'సరే' కాదు — ఇవ్వాళ నేనున్నాను చూడు అంటోంది. నన్నేం చేసుకొంటావ్ నాతో నువ్వేం చేయగలవో ఆలోచించు అంటుంది.

బిందువు ఉన్నది. అలానే దానిచుట్టూ వలయం ఉన్నది. చిన్న చుక్క చుట్టూ ఒక గొప్ప సున్నాని చుట్టినప్పుడు దేహాన్ని ఏం చేసుకోవచ్చో తెలుస్తుంది. అపుడు ప్రథమంగ మనసు స్ఖలిస్తుంది.

ఈ రికగ్నిషన్ని, ఈ డిస్కవరీని ప్రకటితం చేయలేని ఆందోళన ఏవేవో ఇతర మార్గాల ద్వారా వ్యక్తమవుతుంది. చచ్చిపోయిన గాడిద, కరి కళేబరం, బందరు రైలుస్టేషన్‌నించి హిందూ కాలేజిదాక మధ్య వ్యాపించిన నిర్జన శూన్యత్వం, గాలిలో కలిసిపోయి మిన్నాగు విషపు వాయువు వీస్తున్న మొగలిపూలూ, విస్తృతాకాశపు ఎడారిలో అవతలికి కొట్టుకుపోతూన్న ఎండమావుల కెరటాలూ, ఆరోజే కొనుక్కున్న చాప, తలదిండు జేబులో భద్రంగా దాచుకొన్న పాసింగ్‌షో సిగరెట్ పెట్టే కలగలుపయి కాలేజి ద్వారాల దగ్గర 'కల్లేడ' అయి హారంలో దారం అయి ఒక ఆకాశం చీకట్లో వెనక్కి మళ్లి మూతపడి, ప్రయాణానంతరం మరో ఆకాశం విచ్చుకొని అప్పట్లో విడుదలయిన సినిమాలో పాట "చల్లని రాజా! ఓ చందమామా! నీ కథలన్ని తెలిసాయి ఓ చందమామా" గాలిలో కొట్టుకొస్తూ నేను వింటూన్నప్పుడు కృష్ణకిశోర్ సినిమా హాలు ముందు నుంచోని కిళ్లీ కట్టించుకొంటున్నపుడు సంపాదించుకొన్న కొత్త స్నేహాలు కొత్త అయిష్టాలు వ్యక్తావ్యక్తాలుగ స్ఖలిత చేతనని అలల చేతుల్తో మనస్సుని తట్టి లేపుతాయి.

మేక కాలర్ టీ షర్టు ఓటుండేది ఆ రోజుల్లో. డాండీయిజం అంటే తెలీని రోజుల్లో రోజా లేక రోజు విడిచి రోజా అదే వేసుకుంటూ జుట్టు ఆ రోజుల్లో ఎలా దువ్వుకోవాలో అలా దువ్వుకుంటూ ప్రదర్శనకీ ఆకర్షణకీ మనసుని లగ్నంచేసి ఎంత అపరిణత చేతనో ఆనాడు!

వొదులు. అన్నీవిదువు. ఏదీ కావాలనకు. ఒక్క నిన్నుమాత్రం ఒదులుకోకు. దేన్నించేనా సరే రక్షించుకో. బయటంతా శబ్దమే. ఒక్క నీలోనేఉంది నిశ్శబ్దం. అందులోకి కూరుకుపో. విఫలప్రేమలూ అవ్యక్త ప్రేమలూ అన్నీ నీ ఒక్కడిలోనే సఫలమవుతాయ్. ఇదీ ఈనాటి భావ స్థిరత్వం.



4

అది భావధార. ఆనాటిది అపుడపుడూ బద్ధకంగా బందరు స్టేషన్‌కి వచ్చేపోయే రైళ్ల కూతల్ని లెక్కపెట్టటం, చేసిన తప్పుల్ని చెయ్యని తప్పులో హెచ్చవేసుకొని దాన్ని చెయ్యకుండా ఉంటేతో భాగారించుకొని వచ్చిన శేషాన్తో తక్కువేనని సంతృప్తి పడటం, కలగా పులగంగా కలిసిన మిత్రులు చెల్లాచెదరవటం. కృష్ణశాస్త్రి అన్వేషణ పద్యాల్ని 'తలిరాకు జొంపముల సందుల త్రోవలలో' వెదుక్కోవటం. అంతవరకు చూడని హంపీ క్షేత్రాన్ని కొడాలితో బాటు అదృశ్యమై వెళ్లి చూడటం!

*　　　*　　　*

భయపడిన బావురుమన్న చేతులు నిర్భయాన్నందిస్తోన్న బాహువుల్లోకి జారినపుడు, తొలిత ఈనిన ఆవు గుండ్రటి కళ్లతో లేగని నాకినపుడు, నగరంలో రహస్య కాంక్షలదారుల చీకటి వెలుగులకు ఊగుతున్న పురపాలికల వెల్తురు గాజుబుడ్లు పగులాయేమోనని భయపడినప్పుడు, అన్వేషణలో తోడుగా తెచ్చుకొన్న వాడెంతకీ తెమిలి బయటపడని ఒంటరి బాహ్యవలయ విలయంలో సందేహ సంకోచ సంతాప లజ్జా విచ్ఛిన్న వదనంలో ఎటోకటు ఎగిరి మళ్ళీ ఈముఖాన వాలకుండా పారిపోదామనే కళ్లు, మళ్లీ రద్దులోకి గుంపులోకి ఏమీ ఎరిగనట్టే అమాయిక మూకలోకి జొరబడి మామూలు సాదావస్తువులు బేరవాడి చేతులూపుకుంటూ కాళ్లు స్వచ్ఛవెన్నెల్లోకి మైదానాల పవిత్రతలోకి బార జాపుకుంటూ ఇంకనయం బ్రతికిపోయాను ఆకర్షణలోకి మండి మసయిపోలేదని నుసయిపోయిన చిచ్చు నూదుకుంటూ.

ఒక పొట్లకాయి ఒక సొరకాయి బెలూన్లు కొని దూరమెళ్లిన తర్వాత వాటిని పళ్లతో కొరికి ఠామ్మనిపించి, వేరుసెనగ పప్పులు వేడివేడివి ఊదుకొని పొట్టు ఒలుచుకుని తింటూ

రక్షించావురా ఆత్మారావుడా ఆ తడి బురదల బజారు కాంక్షల్నించి ఎవరు గెల్చారెవరు నిల్చారా చిక్కని చీకటి నల్ల నక్షత్రాల వెలుగు కిరణాల వ్రణాల సూదుల సంమల సుందని

గదిలో బడి సముద్రాల్ని చిలుకుతున్న సీలింగ్ ఫాన్‌కింద సంశయాందోళనల గ్రంథ సముచ్ఛయాల పుటలు గలికి ఎగిరిపోతూ బ్రిటిష్ హిస్టరీ హండ్రెడ్ ఇయర్స్ వార్ చరిత్రగతిని ఆత్మికంగా వంద సంవత్సరాల జీవనానికి అన్వయించుకొని

కామానికీ కామ్యానికీ మధ్యనున్న కామాని ఫుల్‌స్టాప్ చేసి రేపటికి చదవాల్సిన పాఠాల్ని గుక్కబట్టి బట్టీపట్టి ఇంతలోనే మనసు చూసే పక్కచూపుల్ని ఎక్కుబట్టి విల్లంబుల్ని 'విల్' అంబులో వెనక్కి మళ్లించి

కాలేజి తరగతి గదిలో ఆ అబ్బాయీ ఆ అమ్మాయీ పేర్లు గోడలమీద శుభలేఖల అచ్చేసి అది చూసుకొని స్వయంతృప్తితో ఆటో సజెశ్చన్‌తో నుచ్చుటపడి

వ్యక్తం అయ్యే భావాల్ని గోడమీద రాతలుగా అవ్యక్తంచేసి ఆ తెల్లారి ఆ నాలుగు కళ్లూ దిగులుతో పగలటం చూచి అచింత్యమమేయ మగాథ మపూర్వమైన ఆనందాన్ని పొంది విలువిద్యలో పలు విద్యలున్నాయన్న గొప్ప సాడిస్టిక్ సత్యాన్ని ఆ నూత్న క్షణకణంలో గ్రహించి

ఓహో మానవులంతా ఒకేరకమైన దిగులుతో పొగిలి కుమిలి బూడిదవుతారుగదా అని నిర్మలానందంలో నిముక్తాకాశంకింద అరచెయ్యి మెత్తని తలకింద నున్నని జుత్తుగా పెట్టుకొని అభీర నిద్రాగగనంలోకి మునిగిపోయానక్కడ కలలులేవు కాంక్షలులేవు చీకటిదారుల రహస్య వెలుగులులేవు–ప్రేమనించి ఓడిపోయినా ప్రేమేనను ఈ ఇరవై సంవత్సరాలూ ఆత్మహత్యనించి రక్షించిందని నేర్పిన బుద్ధుడ్నించి పీకి పెట్టుకున్న ఆ రెండుకళ్లు.

*　　　*　　　*

సంధ్యకేసి చూడటం ఒక గొప్ప అనుభవం. ముఖ్యంగా త్రివేండ్రం కోవలం బీచీలో ఆ జర్మన్ కన్యకాపరమేశ్వరి ఇటలీనుంచి లేపుకొచ్చిన గడ్డం ప్రియుడితోబాటు చౌకబారు బీడీలు తాగుతూన్నపుడు ఆమె ముక్కెరలో మెరిసిన విరిసిన నవ్వు పగిలిన పగడాల కాటేసే విషపు బుడగ పగిలిన సంధ్యను చూడటం గొప్ప అనుభవానంద అతీత అవ్యక్త విషాద మాధుర్యం. పుట్టుగ్రుడ్డి అయినవాడే చూడగలడా వెల్తురు కిరణాన్ని.

రోజా హోటల్ నాలుగో అంతస్తులో అద్దపు కిటికీ కేవల ట్రిపిలెక్స్ రమ్ నారింజరసం సంజ కెంజాయలో కలుపుకుని నాలుగో పెగ్‌లో ఊగుతూన్నపుడు ఈ దేశపు బెల్ ఎయిర్ ఒటేళ్లన్నీ నాలాంటి దేశదిమ్మరులకు నాల్కలు చాచి నా ఇండియన్ ఎయిర్ లైన్స్ బాగ్స్‌ని నాకి చేతులారా ఆహ్వానించితే ఎంత బావుండునని స్వామి వివేకానందలా ఒకే ఒక్క తూరుపుదిక్కుకేసి దృక్కుల్ని నిలిపి ముక్కుమీదనుంచి కళ్లచూపుల ముక్కోణాకారాల్ని దింపి ఆ అఖాతంలో కేప్ కామొరిన్‌ని సందర్శించినపుడు

నా భుజం తట్టినవాడు డా. అయ్యప్ప పణిక్కర్ లండన్‌లో లింగ్విస్టిక్స్ చేసి సరాసరి లుంగీ కట్టుకొని వచ్చినవాడు. నిద్రలో ఆగిన ఊయలని మళ్లీ ఊపినవాడు డా. పణిక్కర్. ఆ మధ్యాహ్నమే రష్యన్ సాంస్కృతిక రాయబారుల్ని దవడలు పగిలేట్లు ఆహ్వానించుకున్న పణిక్కర్.

సలలితరాగ సుధారససార కొబ్బరిబోండాం నీళ్లు ఐదురూపాయిన్నపుడు కాటేజి గుడిసెలు పేదరిక విలాసమన్నపుడు మసాజ్ పార్లర్‌కి యాభయ్ నోటుని మర్దనా చేయాలన్నపుడు కోరల్ గుళ్ల పేరు ఇరవయ్యారన్నపుడు ఆరునూరయినా అంతకంటే బేరం లేదన్నపుడు

నాకు ఆ నిశ్చల సాగరంలోకి దూకాలనీ అలనై ఏదేనా వలలో చిక్కుకోవాలనీ తలంటిపోసుకున్న కొబ్బరి చెట్లన్నీ ఒక్కట్నే ఎక్కాలనీ ఈ ప్రపంచాన్నే పూరీల పిండిలా ఒత్తాలనీ బత్తాయికాయల బొత్తాలన్నీ విప్పాలనీ సముద్ర స్మశానంలో ఒక్కట్నే ఆల్చిప్పల పుర్రెలన్నీ రుద్రాక్షల్లా ధరించాలనీ సంధిజ్వరాన్ని సహించాలనీ ఒకటేపిచ్చి మృత్యూహ జనించింది నూత్నప్రాణం పోసుకొని.

చైతన్యంలోంచి జడంలోకి వెళ్ళటం చాల తేలిక. ప్రతిసారీ ఈ ప్రపంచంలో కన్పించే మనుషులు — మొహంపుల్లలు నవుల్తూ, చెంబట్టుకొని ఎండిన కాలవ గట్లంట వెళ్తూండే ఈ మనుషులు కలల విస్మృతాల్లోకి తప్పుకోవటం కనికట్టంత సులభం. దూరాన్ని దగ్గరకు పిలవటం పొలిమేరల్ని పొలికేకతో పిలవటం తేలిక. చెవిపో టొచ్చినపుడు మబ్బుల్ని చెవిలో దూర్చుకోవటం సునాయాసం.

కానీ కన్పించని ఆవలి తీరాల వలల అవతలి తరాల మనుషుల్ని కేకెయ్యలేం. సమయానికి పిలుపు అందదు. తీరా వచ్చేప్పటికి సంస్కారం అయిపోతుంది. ఈ అరేబియన్ తొడల్నించి అట్లాంటిక్ హృదయంవరకు ఎంత ఈదినా చివరికి రొప్పేగాని ఎవరి మెప్పూ కాదు.

ఒట్టి కట్ డ్రాయరేసుకొని సూర్యోదయానికి చేతులుజాస్తూ పద్యాల్ని దోసిళ్ల నేళ్ల కొసల్నించి విడుస్తూ మంగినపూడి ముక్కోటి ఏకాదశినాడు మునిగి తేలేదాక నాకు ఎవరన్నా లెక్కాలేదు. సీమా సమయాల్ని జయించేదాక జమాలేదు. డా. పణిక్కర్‌కీ తెలుసా విషయం.

*  *  *

ఏమి రాసినా చీకట్లో రాయాలి వెలిగే కలంతో. ఏమి చెప్పినా నిద్రలోంచి కలలోకి మేల్కొని జోకొట్టుకోవాలి. పలచని ఎండ ఈ ప్రపంచంమీద నాకు తెలిసి ఇప్పటికెన్నో వేల పగళ్లు పగిలింది. అవన్నీ నల్లనిరేయి అలలకి కొట్టుకుపోయినయ్. నేలంతా నునుపయి జారిపడి మళ్లీ నేకువనే లేచి చూచుకుంటాం.

నాలుగువేపులా కూచుని ఈ ప్రపంచానికి కేరమ్‌బోర్డు ఆడు కున్నాం. నీకెక్కువ కాయిన్లు రావాలని రెడ్‌కూడ కొట్టుకోకుండ చేతకానట్టు ఒదిలేసాను. అదే గొప్ప దెబ్బతీసింది. దివాళా తీసాను.

నాలుగు సంవత్సరాలు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రేమ శవాన్ని మోసిన మిత్రుడికి అర్ధరాత్రిపూట బావినీళ్లు చన్నీళ్లేఅయినా తోడిపోసి కుంకుడుగాయ రసమంటి కొత్తపంచె కట్టబెట్టి తెల్లా తెల్లారి బళ్లారి రైలుకెక్కించితే వాళ్లిపుడు రెండు భూతాలై చెరొక కొమ్మా ఎక్కి కూచున్నారు. వాళ్లిప్పుడు వ్రేలాడే గబ్బిలాలు. పిల్లలు అసహాయ అసౌందర్య గుడ్లగూబలు.

మెలకువనించి ప్రజ్వరిల్లిన పగటి వెల్తురుకి తట్టుకోలేక స్వర్గాతీత ఆనందాన్ని కప్పుకోలేక లక్నోనించి తుఫాన్ మెయిల్లో వస్తూ వారణాసి స్టేషన్లో దిగి మొదటిసారిగాకొన్న సారా సీసాతో సరాసరి సారనాథ్ వెళ్లిపోయాను. సాంచీకి లాంచీమీదే వెళ్లాలి. అజంతా గుహలకి హలంతాలందరూ వెళ్లితీరాలి. ఎల్లోరాలో ఏకాంత మసలే పనికిరాదు. సౌందర్యం గడ్డకట్టిన రాళ్లవక్షస్థలాలమీద సంగీ తాన్ని రంగరించాలి. ఏకాంతసేవ బానిసత్వం.

ప్రపంచంలో మూగవాళ్లందరుంటే అంతమందీ చెవిటి వాళ్లుండితీరాలి. ఒట్టి కళ్లుంటే చాలు. చల చంచల సర్పాల సెల యేళ్లు నిశ్చల శతాబ్దాల పర్వతాల ఒరవడి ఇరుకుల్లోంచి దూరి వస్తాయి విషపు నాల్కలు చాచుకొంటూ.

వృథాప్రయత్నానికి వ్యర్థవాక్యం వృద్ధాప్యంలోలా తోడు ఉండాలి. అది గంగలో శవంలా మునుగీతలీదుతూ తేలుతూ దశాశ్వ మేధఘాట్‌కి కొట్టుకుపోతుంది. పగిలిన గాజులు చిరిగిన చేతుల్ని చీరుతూంటాయి.

రామ్‌లీల మైదానంలో ప్రతి రావణాసురుడూ తగలడ్తాడు. రహస్య రాత్రిలోంచి కేకేస్తూ వచ్చిన ప్రతివాడూ సూర్యోదయానికి బూడిదయిపోతాడు. గోనె సంచీలో మూటకట్టిన ఖండిత శిరస్సు దాని ఓనర్ ఎక్కడున్నాడోనని కేకలేస్తూ అరుస్తుంది. పిలిచినా రాదు మొండెం. అది కూర్చుంటే నుంచోలేదు. నించుంటే కూర్చోలేదు. అందుకనే అది గాలిలో తేలే కుర్చీ. భూమ్యాకాశాలమధ్య వేలాడు తూన్న నిచ్చెన. దానిలో మెట్లు ఒకటి విడిచి ఒకటి విరిగో వేలాడు తూనో ఉంటై. జీవించటం అంటే భూమ్యాకర్షణ శక్తికి తట్టు కోవటం. ఎగిరిన రాయి కిందపడిందంటే అది చచ్చిందన్నమాటే. కర్త కర్మ క్రియల్లోకి బిర్రబిగిసిన వాక్యం శవంతో సమానం. సమా సాలూ సంధులూ కుదిరిన వాక్యానికి మానం కోల్పోయిన శీలం. మర మేకులు మరీ ఘోరం.

అటు పార్లీ ఇటుపార్లీ మూడో బెర్త్‌మీంచి రాలిపడినప్పుడు గానీ తెలీదు మనకి నిజంగా అది రైలు ప్రయాణమని. విమానం లెవేటరీలో కూచుని సిగరెట్ వెలిగించినపుడు వెలుగుతుందొక ప్రమా దపు దీపం. మియామీ బీచ్‌ముందు బీరుసీసాల పేళ్లు వేళ్ల గోడ్ల ళ్లతో పగలేస్తున్నపుడు గొంతుకు గుచ్చుకున్న గాజుపెంకు తిరుగు తుంది గ్రామఫోను ముల్లులా సైగల్ రికార్డు మీద.

ఒంటిమీద రాసుకున్న దిగంబర కవిత్వంలో అక్షర ఆత్మ అశ్లీలాలున్నాయని ఒంటేలు పోసుకోరెవరూ జడుసుకొని. గిన్స్‌బర్గ్ బహిరంగంగా ఆత్మను చుట్టిన వలువల్ని విడిచేసినపుడు కన్పించిందే ప్రాదేశిక సౌందర్యం. అపొలెనార్ మెదడు చిద్రుపలు చిద్రుపలై నపుడే అతని కవిత్వంలో అక్షరాల వానకురిసి మొహమంతా తడిసింది. బాదెలేర్ మలార్మేల మగప్రేమల, సుఖవ్యాధుల గాథల్నించి మొలిచిందే ఆధునిక ప్రతీకవాదం.

సముద్ర జలానికి గీజర్ ఆన్‌చేసి దేశదేశాల స్నానశాలల్లోకి బొట్లుబొట్లుగా పంపిస్తే ఆ వేడి కన్నీళ్లలో సబ్బునురగలో ప్రపంచ పౌరులందరూ నాసి ప్రేమ టర్కిష్ తువాళ్లతో ఒళ్లు తుడుచు కోవాలి. ఇది ఒక్క అట్లాంటిక్ తీరాననే సాధ్యం. హిందూమహా సముద్రంలో, బే ఆఫ్ బెంగాల్‌లో మరీ చేపల వాసన. అరేబియన్ సీలో ష్రింప్‌లన్నీ పింప్‌లు. దుబాయ్‌లో కష్టం సుఖం తెలిసిన బాబాయ్ ఎవడైనా ఉంటే మరీ మంచిది. మాస్కట్‌లో మస్క్ పూసుకున్న కస్తూరీ మృగంలా తిరిగితే మరీ మంచిది. ట్రౌట్‌లు తినడం ట్రౌట్‌ల సావాసం.

వెల్లివిరిసిన ఇంద్రధనుస్సు పుల్లలు విరిస్తే ఎల్లలన్నీ వెల్ల బోతాయి. నడుస్తూన్న నల్లని శవాల ప్రాణం పరదాలు తొలగిం

చటం ఒక మృత్యు సరదా. వేసిన తాళాలు వేసినట్టే ఉండి కవిత్వపు గదిలో దాచిన వస్తువులన్నీ మాయమై పోతాయి వాక్యం రాసినపుడు. దసరాకయినా సరదావేషం వేయకూడదు వేసామో పులులమయి కూచుంటాము. ఏది చేయకూడని పనో దాన్నిచేస్తే చెయ్యాల్సిన పనిని చేసి తీరినట్టే.

మేడమెట్లు ముందు పురుషుడు ఎక్కకూడదు. ముఖ్యంగా స్త్రీ వెనకున్నప్పుడు. ఎందుకంటే జఘనాల్ని ఘనంగా సత్కరించాలి. మేడమెట్లమీంచి నది కిందికి దూకుతూన్నప్పుడు ఆ ప్రవాహంలో ప్రిమ్‌రోజెస్‌లా మనం రాలిపోవాలి రక్తం కక్కుకుంటూ.

గంటకొకసారి ఆగి దినానికొక దారి వెతుక్కుని దశాబ్దాన్ని శతాబ్దంలోకి కలుపుకుని చివరికెప్పుడో అలారం పెట్టుకుని అది మోగినప్పుడు గతుక్కుమని గ్రాండ్ కాన్యన్‌లోకి కూరుకుపోవాలి. మిలీనియమ్స్ తర్వాత మన దంతాలు, నఖాలు, కేశాలు, మోహాలు మెరుస్తూ పెరుగుతూ చిక్కబడి దొరుకుతాయి యాంత్రొపాలజిస్టులకి. మనం ఉమిసిన ఉమ్మిలోనూ కక్కిన కళ్లెలోనూ పెరిగిన క్రిమి కీటకాలు కళ్లువిప్పి చూస్తుంటాయి కిర్మీరాల్లా కొత్తకాంతి సంవత్సరాల చీకట్లలో.

ప్రాణం ప్రసక్తి వచ్చినపుడల్లా ప్రతివాడూ ఒక ప్రవక్త అవుతాడు. చేయని మంచికీ చేసిన చెడుకీ మిగిలే సగర్వ సంతృప్తిలో బాంధవ్యాల బంధనాలు పటపటా తెగిపోతయ్. ఆత్మ ఒక్కటే గాలి పటంలా ఎగురుతూ శరీరాన్ని సర్వే చేస్తుంది. గాయపడిన కాయాన్ని గాలంవేసి లాక్కెళుతుంది.

* * *

మనసు నిశ్శబ్ద నీచికలలో పొర్లాడినపుడు ఎండు రావిఆకులు గాలిలో తేలి గలగలలాడినపుడు గోదారిమీద రైలు తెడ్లు వేసుకొని ఈదుతూన్నపుడు మనసుకంటే వేగంగా చూపులు ఆ గతంలోకి చొచ్చుకుపోయినపుడు జాక్విలిన్ ఓ జాక్విలిన్ నీ కరచరణాలకు స్పెల్లింగేమిటి ఇంటీరియర్ కారిడార్స్ ఆఫ్ డిజైర్‌లో గుట్టలుగుట్టలుగా పోసిన కాబేజీ పూవులు ఉల్లిపాయలు తెగనరికిన ఆధునిక దారుశిల్పపు కొయ్యలో విన్పించిన కాబరే సంలీనపు నృత్యం జాక్విలిన్ ఓ జాక్విలిన్ నీ అనృతానికి స్పెల్లింగేమిటి ?

రహస్యంగా ప్రతివాడూ రామకోటి రాస్తూంటాడు. దగాపడిన జాక్విలిన్‌లకోసం బీరుతప్ప నోరువిడిచి సీరడగని సిల్కుపూలకోసం నకిలీ నవ్వుల నగిషీలకోసం ప్రతి ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్ వస్తాడు.

కలలో అద్భుతంగ తిరిగిపడిన తల. ఒకటే దాహం. ఎంత విస్కీపోసినా గొంతుదిగదు. రహస్య సుఖాల సిల్కుపరదాల జిలుగు దారాల వెనుక పట్టుపురుగు పడుకున్న పందిరిమంచం పామై కాటేస్తుంది. పర్సులోంచి వస్తుంది విషమంతా. దాంట్లో దానికోరల

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలక ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో
మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మన సినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు ★ మా ఊరి సమస్య ★ శ్రీకృష్ణభాగవతం
★ ఇది నారీదృక్పథం ★ అరణ్యకాండ ★ వింత యదార్థం
★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి ! మేనేజరు, ఆంధ్రపత్రిక

ఫోటో ఉంటుంది. కాలం కరచిన కడపట పాలవాడి కేక విన్పిస్తుంది కాఫీ ఆవిర్లు కక్కుతుంది.

ఎట్లా ? ఎట్లా ? భయాన్నుంచి కాపాడుకోవటం అట్లాంటిక్ సముద్రతీరాన్నంతా ఆక్రమించి పడుకున్న పై పెదని నిర్భయాన్ని కాచుకోవటం ? ఎట్లా ? ఎట్లా ?

నేనింకా తలుపులు తీయలేదు. తీయను. అసలు తాళం చెవి ఎక్కడోపోయింది. దొరికినాగాని తీయను. తాళం కప్పకంటే విలువయిందేమీ లేదులోపల. నేనే తాళాన్ని నేనే చెవిని. నా చెవికి 'కీ' యిచ్చినా తాళం తీనుగాక తీయను.

ఒద్దొద్దు. లోపం పూలు తగలడుతున్నాయ్. ఆ శవాల సుమాల దగ్గ పరిమళం ఆఘ్రాణిస్తే నీ శ్వాసకోశాలు పొగచూరిపోతయ్. గోళ్లతో గీరినా పోదామసి. ఉండుండి అదే రాల్తుందిలేమసి.

వొచ్చెయ్. మళ్లీ వెనక్కిమళ్లు. అటు వెళ్లకు. దారంతా ఆస్త్మావాడు మునిగిన గోతులు. కుంటివాడు కర్రకాళ్లు గుచ్చిన ముళ్లు. కుష్ఠువాడు రాసుకున్న పొగడ్డర్ ధూళి. గుడ్డివాడు అలుక్కున్న పేడ.

ఇటొచ్చి ఆనందంగ నవ్వు. ప్లేటులో వెన్నెల టూటిఫ్రూటీని చల్లగా చప్పరించు. మంచులో తడిసిన సారపూవుల్నిమృదువుగాచూడు.

ఎటొచ్చీ వెళ్లిన చోటికే మళ్లీ వస్తుంటావు. వచ్చినచోటికే మళ్లీ వెళ్తుంటావు. మనసుమీద వాలిన ఈగ కంతిరీ కందిరీగని తోలటానికి శరీరం గింగరాయిలు తిరుగుతుంది. ఈ పృధ్విచుట్టూ పరిభ్రమిస్తుంది.

భ్రమలోంచి తేరుకోవటానికి స్మైల్‌లాంటి ఓ సూర్యకిరణం విచ్చుకోవాలి. అర్ధరాత్రి అయినా సూదిలా పొడవాలి. వెల్తుర్ని నరాల్లోకి పొడవాలి. కండరాల్ని నరాల్ని ఎంత బిగబట్టితే ఇంజెక్షన్ అంత నొప్పి. ముందు మనసుని ఈగవాలిన మనసుని స్పిరిట్‌తో తడిసిన మబ్బుతో తుడవాలి. రైలు ఇంజన్ నుదుటిని ఢీకొన్నపుడు హాయిగా తేలికగా గాలిలోకి నవ్వేయాలి. అపుడైతే నొప్పి ఉండదసలు. రాసిన రామకోటి నందరికీ చూపించాలి !

* * *

అచేతనాలన్నీ సచేతనాలయినపుడు అన్నీ ఆరురూపాయిలే. కిస్‌మిస్ ద్రాక్షపళ్లు కిలో అరురూపాయిలు. రంగురంగుల లంగా ఒక్కొక్కటీ ఆరురూపాయిలు. తూచి ఇస్తాం. తీసి ఇస్తాం గుట్టల్లోంచి. అరటిపళ్లు ఆరు డజన్లు ఆరురూపాయిలు. అరూపాలన్నీ రూపాలయినప్పుడు అన్నీ రూపాయిల్లోనే లెక్కకడ్తాం. ఒలికిన హృదయాల్తో వెళ్తున్న ఆ పన్నెండుమందీ నిజానికి ఆరుగురే. వాళ్ల ఒక్కొక్కళ్ల నెత్తిమీదా అర్ధరూపాయే ఉంది. అర్ధరూపాయంటే అర్ధనగ్నంగా ఉన్న పాపం ఖరీదు. ఆరు కొబ్బరి బోండాలు ఆరురూపాయిలు. ఆ రూపాలన్నీ విరూపాలయినప్పుడు అన్నీ కారుచౌక !

బేరవాడ్తాం. మనకొచ్చే నష్టం ఎంత మనకుపోయే లాభం ఎంత అని. గీచి గీచి గొంతు అరిగి కీచుగొంతుకయినాసరే. మూడడుగులు ముందుకీ ఆరడుగులు వెనక్కీ శతాబ్దాల సాయంత్రాలనుంచీ వేస్తూనే ఉన్నాం. ఎన్నో మిలీనియమ్స్‌నుంచీ బేరవాడిన వాడిన వాడికి మాత్రమే తెగుతున్నై అరటిపళ్లు, ఊగుతున్నై ద్రాక్షపళ్లు, చేజిక్కుతున్నై ఆంతరిక వస్త్రాలు.

ఎక్కాల బొక్కు ఎవడు రాసాడు ? పెదబాల శిక్షను రచించిన దెవరు? కూడికల డొక్కల్లో తీసివేతల తన్ను తన్నిందెవడు? కీకారణ్యంలో క్రావడి పెట్టినదెవరు?

ఎవడు ఏం కొనుక్కుపోతున్నాడు ? ఎవడు ఏం కట్టుకుపోతున్నాడు? వచనానికి నిర్వచనం ఏమిటి ? తగలడుతున్న నిశ్శబ్దాన్ని గంటలకారు ఎర్ర ఏనుగులావొచ్చి ఫీంకరించి ఆర్పుతుంది. ఆసుపత్రిలో తెగిన ఆఖరి పేగుని డాక్టరు మెళ్లో వేసుకుని ఇంటికెళ్ళిపోతాడు. నర్సు మూలుగుల మాలికల్ని కంఠసీమ నలంకరించుకొంటుంది.

ఆరేళ్లో అరవై ఏళ్లో బతుకుతాం. ఆరేళ్లముందు ఎలా పుట్టామో ఎవడికీ తెలీదు. అరవై తర్వాత ఎలా చస్తామో మనకీ తెలీదు తీసుకు తీసుకుని తడిసిన నులక మంచానికి తప్ప. ఆరునుంచి అరవైదాక ఈలోపల బేరవాడ్తాం. చివరికి గిట్టుబాటవుతుందితప్పక.

ఒకే కవితకు ఆరు అర్థాలు ఒస్తాయని ఒకడు అమ్మ చూపుతాడు. ఆరూ అనర్థాలే. అసలర్థం అమ్మేవాడికే తెలీదు. కొనేవాడు నూరర్థాలు అడుగుతాడు—ఓ శతాధిక గ్రంథకర్తని. శతపత్ర సుందరిని అరవైఏళ్ల ఆంధ్ర కవిత్వాన్ని ఆరురూపాయిలకే అచ్చెయ్‌మంటాడు ఆరసున్నాలకి అమ్ముడుపోయేవాడు.

శకటరేఫాల తోపుడు బళ్లమీద కుళ్లిన అరటిపళ్లు, ఈగలు ఇరుక్కున్న ఖర్జూరాలు, ఎండిపోయి సీలలు ఊడిన సీసపద్యాలు అన్నీ ఆరురూపాయిలకే అమ్ముతుంటాడొకడు ఆరున్నొక్కటి అనికూడ అనడా ఏడుపు ముఖంవాడు.

ఇది అర్థానుస్వార ప్రపంచం. అర్థశూన్య ప్రపంచం. శూన్యఅర్థ ప్రపంచం. దీనిమీదనొక ఆరడుగుల అరుగు కట్టాలి. కట్టిప్పతంలో శోకించాలి. పుట్టినందుకూ పుట్టనందుకూ జీవించినందుకూ జీవించనందుకూ మరణించినందుకూ మరణించనందుకూ అరకొరగా ముక్కు మూసుకుని ఆరు అరనిమిషాలు ఏడవాలి. చివరకి ఆరున్నొక్కోసారి.

* * *

కలల కళ్లు మెలకువలో పగిలిపోతయ్. గోళీలాడుకునేప్పుడు ఒక కన్ను వెళ్లి ఇంకొక కన్నుని గురి తప్పక కొట్టుంది. కలల మైదానంలో గోల్ఫ్ ఆడుకుంటాం. ఆవలింతల కర్రల్తో బంతుల్ని సారంగాల్లోకి నెట్టేస్తాం.

ప్రతి పదార్థానికీ ఒక చైతన్యం ఉంటుంది. ఉల్లిపాయ నన్నొలవమని అదే పనిగా అడుగుతుంది. బాత్ రూం పిలుస్తుంది బట్టల్ని విడవమని. రాయి బెకబెక లాడుస్తుంది. నీరు రాయయిపోతుంది. కందమూలం పిలకేస్తుంది. బంగాళదుంప రామ్ములక్కాయ కూరలో కలిసి

పాసూటో అవుతుంది. పాలు తాగే పసిపాప అన్నం కుండకేసి చూస్తుంది.

కొండకి సందుపెట్టేవాడు రంధ్రంలో కూరుకుపోయి పేలి పోతాడు. రిక్షా లాగేవాడికీ రక్షాబంధనం కావాలి. కండెమ్డ్ సెల్‌లో ఉన్న హంతకుడి అహంతకి కాస్తంత తోడు కావాలి. ఉరికొయ్య నన్ను నరికెయ్యమంటుంది. పలుగే తవ్వుతుంది వజ్రాన్ని. వేలు జారిన ఉంగరం వేలికి తగుల్తుంది. కాలుజారిన అమ్మాయి రూపాయిల చేతులకు చిక్కుకొంటుంది. అలల్లో వలలోకి కవల చేప పిల్లలు చిక్కుకుంటాయి.

చీకట్లోనూ పడుతుంది భారంగా వంగి నడుస్తూన్న వాడి మోస్తూన్న బస్తాల నీడ. నడుం విరిగినపుడు మాత్రం నీడ సాఫీగా పడుకుంటుంది. రూపాయిలు ఎండలో ఎగుర్తూన్నపుడు మాత్రం వాటి స్వార్థపునీడ కళ్లల్లో పడుతుంది. వెన్నెల్లో చిల్లరమోగినపుడు నక్షత్రాలు మిణుకు మిణుకు మంటాయి. వాటిని అందుకొనే గోళ్లు కాంతులీనుతాయి.

ఆశల కాంతులు నిరాశలో నీడలవుతాయి. వీడిన శ్వాసలే ఈ ప్రపంచమంతా వీచే గాలి. పోయిన ప్రతివాడూ ఎగిరి తొమ్మని పగిలిన రబ్బరు బూర.

అంబరంలో మబ్బుల సంబరం. వాటి ఛాయా చిత్రాలే ఈ కొండలు. దిగివచ్చిన సెలయేళ్లే ప్రవహించిన కన్నీళులు. వాటిని మళ్లించి గట్లు కట్టుకొని నదులుగా మలచుకొని డామ్‌లూ రిజర్వాయర్లూ కట్టుకొని పంటపొలాల్ని పండించుకొంటాం.

కలత నిద్రలో కళ్ల కాళ్లు విరిగి క్రరకళ్లవుతాయి టకీ టకీ మని గడియారం అలారం చప్పుడికి. అలారం గుక్కపట్టి ఏడ్చే పసిపాప.

స్మశానం శవాన్నొక్కసారి వచ్చిచూచి సంతృప్తిగా వెళ్లిపోతుంది. వార్డునిండా పగిలిన మందుసీసాల గాజుపెంకుల ఎముకలు. ఎలుకలు చచ్చిన ఫినాయిలు వాసన. దుఃఖంలో విసర్గని తీసేస్తే అది మహాకావ్యంలో సర్గ. సర్పసరాల సామూహిక దాంపత్య పరిష్వంగంలో కోరికలు పెనవేసుకొంటై. పాముల జడలల్లేవాడి చేతుల్నిండా పుట్టేడు విషం. విషాద కషాయంలో కాస్తంత టీ పొడుంతోబాటు నిమ్మరసం పిండితే ఓ చుక్క అది చక్కనిచుక్క అవుతుంది— ఆ జర్మన్ కన్య ముక్కు బేసరిలా ముఖం బేసిన్‌లో మెరుస్తూంటుంది. లీల అవలీలగా చైతన్యం పొందుతుంది. సహజా ఓ సహజా!

అర్ధరాత్రి కూచుని ఎందుకీ రాయటం? అర్ధప్రపంచం నిద్రార్ధభాగంలో కప్పుకున్న చీకటి దుప్పటి నెందుకిప్పుడు లాగటం? కట్టేయండి రేడియోలు. ఇదే ఆఖరి శ్వాసల ప్రసారం. హాలీడే ఇన్‌లో ఆఖరి డిస్కో అయిపోయింది. మొరిగి మొరిగి వీధికుక్క చచ్చిపడింది. కవిగాడి ఆఖరి ఆశ్వాసాంత పద్యం మృత్యువుచేత పట్టుకొచ్చిన ఆశ్చర్యాంతకంతో ముగిసింది. చింపండి సర్వసంకలనాల పుటలు.

నేనున్నాననుకొన్నాను. ఉంటూన్నాననుకొన్నాను. ఉంటాన్లే ఇంకా అనుకొన్నాను. నిశ్శబ్ద నిశీథిలో మూలుగునై ముగిసాను. అమెరికన్ సంగీతం అసహ్యం. జుబెన్ మెహతా తీగలు సాగినపుడు యాహూదీ మెనిహన్ ఊహాలోకాల తీగలు సాగదీసినపుడు డ్రమ్స్ ఆఫ్ ఇండియా రికార్డులో రవిశంకర్ తాళం వేసినపుడు బిస్మిల్లాఖాన్ లొటాకు నరాల బూరలు దారాలుగా ఊదినపుడు బీర్‌లో బ్రాందీ కలిపి ఆ గుండిగలో చచ్చిపడిన ఎలుకల్లా పాదాల్ని వెచ్చజేసుకున్నపుడు అలిసిన ఆత్మకు కూటికూర పొగడ్డర్ పులుముకున్నపుడు పుసులుకట్టిన కళ్ల పుళ్లల్లోకి బొద్దింకల విషాన్ని నిమ్మరసంలా పిండుకున్నపుడు గొంతులోకి కుంకుడుగాయి వేడికషాయాన్ని వొంపుకున్నపుడు ఆల్ఫ్స పర్వతాలమీద ఎగురుతూ నా మరణ కాల శ్వేతవస్త్రాన్ని విమానం మీంచి విసిరేసినపుడు హీత్రూ విమానాశ్రయంలో సగమానం కప్పుకున్న గమ్‌బూట్స్ తొడుక్కున్న అమ్మకాల సుందరిని నా కళ్లు కాళ్లు ఒల్లీ బిల్లీ పరికిణీ అంచుల్లా తిరిగినపుడు—ఎప్పుడన్నా అప్పుడప్పుడు బతికిన గుర్తులు లీలగా మాయగా బేలగా.

కట్టేయండి కట్టేయండి రేడియోలు. కొట్టండి కొట్టండి గొడ్డళ్లతో పగలకొట్టండి టీవీలు. పూడ్చిపెట్టండి పెట్టండి మీ కళ్ల కేమెరాలు. పళ్లు పీకేవాళ్లు, దర్జాల దర్జీలు, మ్యూజియం కళాఖండాలని తుపాకుల్తో కాపలా కాచేవాళ్లు, లిబర్టీ స్టాట్యూ పాదాలకింద గొంతుక్కూచున్న దేశ దేశాల బానిసలు, భంగు నల్లమందు ఎల్‌ఎస్‌డి మరియు దానా బస్తాలు మోసేవాళ్లు, చికాగో రహస్య నగర మాఫియా ముఠాల్ని సంరక్షిస్తున్న రక్షక దళాల దళారీల గుర్రాలు, ఫిలడెల్ఫియాలో క్రాకిచ్చిన లిబర్టీ కన్ను, వాషింగ్టన్‌లో ఒక చేయిచాచిన నల్లని చాకు, బయటకు పిండిన ఒక నీగ్రో నగ్న స్తనం, డాలర్లు స్టెర్లింగ్‌లు యెన్నులు రూబుల్స్ ఫ్రాంక్‌లు రూపాయిలు వేయేల అన్నీ అవన్నీ వాళ్లూ వాళ్లంతా మసై మసై శవాల స్మశానాల మంటల గోతులై పోవాలి. ఆకాశం ఒక్కటే విముక్తంగా విశుద్ధంగా ఆశా శిశువుగా పసిపాపగా ఉండాలి.

నాకు సంగీతం వొద్దు. చిత్రశిల్ప కళాఖండాలొద్దు. బొక్కలొద్దు బుక్కులొద్దు. ప్రార్థనలొద్దు ప్రాణాచారాలొద్దు. సమాజాలొద్దు సమాధులొద్దు. కాయిర్స్ ఒద్దు కాఫిన్స్ వొద్దు.

మట్టే కావాలి. కన్నీళ్లతో పిసికిన నల్లరేగడి నేలేకావాలి. తడి బురదలో జారే బొటనవేలే కావాలి. గ్రాండ్ కాన్యన్‌లోకి రాలి విరిగి ముక్కలైన విమాన విహంగపు చెక్క రెక్కలే కావాలి. కాలానికి అతీతాన ఎప్పుడో చెప్తుంది అసలు వేదనా రహస్యం ఆ మిగిలిన బ్లాక్ బాక్స్ ఒక నల్ల కవిత!

* * *

విధ్వంసమైన బతుకుని ధ్వంస రచనచేసి బాగు చేసుకోవచ్చును. గడియారాన్ని నేలకేసి కొట్టినపుడు టైమ్ దానంతటదే కుదుటపడ్తుంది. లక్షణాల విలక్షణత్వాన్ని అలక్ష్యంచేస్తే సామాన్యార్థకాలు సిమిలిట్యూడ్స్ విడివడిపోతయ్. నిర్లక్ష్య నిర్లజ్జా నిగర్వాంధకారంలో అన్నీ చీకటిదారులూ కాంతి పుంజాలే.

మారుతీనగర్ పల్లంలో పక్కనే మురుక్కాలవ. ఆ గదితో చీపురుండదు తుడవటానికి. గులాం గౌస్, ఖాదర్ మొహిద్దీన్‌ల అతి

మానసిక సంస్కారాన్ని శుభ్రం చేసుకోవాలంటే బ్రూవ్‌స్టిక్ కల్చర్ ఖరీదు ఐదువొందల రూపాయిలు. తలంటోసుకోవాలంటే అప్పటికప్పు డెళ్లి అప్పేసి తెచ్చుకోవాలి నాలుగో ఐదో కుంకుడుగాయలు. మిట్ట మధ్యాహ్నమెపుడో నీళ్లొచ్చిన తర్వాత ఎసట్లో బియ్యం వేసుకోవాలి. ఆ గదులకు తాళాలుండవ్ తలుపులుండవ్. అందుకనే పుస్తకాలుతప్ప ఎవరూ ఏమీ కొట్టెయ్యరు. పప్పెవరు బాగా ఉడికిస్తారు ఉప్పెవరు బాగా కసిం చేస్తారని పందాలు వేసుకొంటారీ పారిషియన్ పాయిట్స్. అవనత వదనంతో ఏ ఐదారింటికో ఉడుకుతుంది సూర్యుడి వొణ్ణం. ఈ అన్నం ఉడికీ ఉడకగానే వెచ్చని గోరుముద్దలు తినిపిస్తారు తులసీ ఉషాలు. అడుక్కొచ్చో కొట్టేసో రహ్మాన్ కాలుస్తాడు సిగరెట్. ఆ పొగని తీగలు లాగుతూ నేనూ రెండున్నర దమ్ములు లాగుతాను.

చలం ఇంకా జీవిస్తున్న ఈ నేలమీదే ప్రేమల, పెళ్లిళ్ల సాఫల్య వైఫల్యాల భయాలు. ఆనందాన్ని భరించటం ఎంత బాధో నేను సోదాహరణాత్మకంగా నవ్వుతూ చెప్తాను. వాళ్లందరూ ఏడవ బోయి కూడ చిర్నగవులు చిందిస్తారు. క్రమీణా చీకటి రాలుతూం టుంది గదిపైన అల్లుకున్న బూజు బురుజుల్లోంచి. ఎవరి తల వాళ్లే అంటుకోవాలి. ఎవరి నెత్తి వాళ్లే కొట్టుకోవాలి. ఎవడిపళ్లెం మాత్రం వాడు కడగకూడదు. చేతులే అన్నపు పళ్లాలు.

'కాళ్ల' వేసిన మార్క్స్ చిత్రపటం అలమారలో అడ్డంతిరిగి పడుకొంటుంది. మార్క్స్ గడ్డం రోజురోజుకీ పెరుగుతూంటుంది. సంశయాల సాలీళ్లను విదల్చాలంటే ఐదువొందల రూపాయిలు కావాలి. మల్లీశ్వరి సినిమా చూచొచ్చిన తర్వాత కూడ మనుషులు మౌనం పాటించరు. నవ్వనూ నవ్వరు. తుఫాను వేడికి కొట్టుకుపోతూన్న గాలిలో మధ్యాహ్నం ఒక్కటే మౌనంగా ఉంటుంది.

చీకటడిన తర్వాత లైట్ లేకుండ సైకిల్ తొక్కితే దొంగలు పట్టుకొని ఎర్రని బుట్టల్లో నాలుగు రోజులు అలా ఉంచేస్తారు. స్మశానంలో సైకిల్ తొక్కుతూన్నపుడు కూడ లైటెందుకు? కొరివి దయ్యాలు ఎర్రటోపీలు పెట్టుకొని ఆగాగు అంటాయ్. రాయని కవితలు నాలుగో ఐదో జేబులో పెట్టుకొని వచ్చేస్తాను రాత్రికి యింటికి మారుతీనగర్ డౌన్‌నించి.

# హవిస్సులుగా...

శ్రీ కె. ఏ. ఎన్. రాఘవన్

అంతరిక్షంనుండి నాతో జారిన నక్షత్రాలు కొన్ని
తమను తాము మరచి
చుట్టూ చీకటి తెరలు దించుకొని
దివిజ భాగీరథీస్రోతస్సును
మురికి కాలువల్లోకి మళ్లిస్తున్నాయి
ద్యావా పృథ్వ్యలమధ్య
బిందువుకు వృత్తానికి మధ్య
అనుభవానికి కావ్యానికి మధ్య
నేను నిర్మిస్తున్న సువర్ణ సేతువును
ప్రాణం పోసుకున్న రాక్షసత్వం
కూల్చివేయాలని చూస్తుంటే
భగ్గుమన్న మహ సంకల్పాగ్నిని చీల్చుకొని
ప్రభవిస్తున్నారు
శార్ఙ్గనందక సుదర్శన గదాంశులు
సితాంభోద మూర్తులు, రుద్రులు వీరభద్రులు
ఒక్కొక్కరు
సహస్ర శీర్షులు సహస్రాక్షులు సహస్రబాహులు
హృదయ కుసుమాలు వెదజల్లి
పూర్ణకుంభంతో స్వాగతం పలకండి
సత్సంకల్ప జనిత తేజశ్చక్రాలు
దిగివస్తున్న దేవతలకు మహాయుధాలు
సరళ రేఖను సుందర వృత్తంగా మారుస్తూ
హిమాలయాన్ని మహోదధితో కలుపుతున్న
మహాయజ్ఞానికి
అలసత్వపు గూళ్లను చెదరగొట్టి
హవిస్సులుగా కదలి రండి
నాకు తెలుసు :
దివిజ రాక్షస మహాసంగ్రామంలో
అగ్ని మూర్తుల కపజయం లేదని
నాకు తెలుసు ! ఒకనాటికి
ధాత్రిపై శరజ్జ్యోత్స్నామృత వర్షం కురుస్తుందని
మధుర మనోజ్ఞ ప్రసన్న మూర్తులు
ధాత్రిని పాలిస్తారని
అంతవరకు నేను
ప్రజ్వలిస్తున్న మహసంకల్పాన్ని
అశాంతిగా తిరిగే అగ్ని నక్షత్రాన్ని.